# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ సంపుటి : 18 సంచిక : 292 బుధవారం, జూన్ 18, 2025 పేజీలు:4 వెల: 1 రూ/

Published from Hyderabad, Medak Nalgonda, Karimnagar, Warangal, Khammam


MHR TV

## 162 మృతదేహాలకు డీఎన్ఏ నిర్ధారణ



అహ్మదాబాద్ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారిలో 162 మంది డీఎన్ఏ నమూనాలు వారి కుటుంబ సభ్యులతో సరిపోలినట్లు అధికారులు మంగళవారం నాడు ధృవీకరించారు. ఇప్పటివరకు 120 మంది మృతదేహాలను వారి

2లో..

## ఇజ్రాయెల్ 'మొసాద్' కేంద్ర కార్యాలయంపై ఇరాన్ బాంబుల మోత




ఇజ్రాయెల్ ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఇజ్రాయెల్ అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తుండగా, ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌లోని కీలక ప్రాంతాలపై క్షిపణులతో

2లో..

## ఎయిరిండియా డ్రీమ్ లైనర్లకు క్లియరెన్స్ ఇచ్చిన డీజీసీఏ

- నిర్వహణ లోపాలున్నాయని స్పష్టీకరణ




న్యూఢిల్లీ ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లో తరచూ తలెత్తుతున్న సాంకేతిక

2లో..



# ఏ పని చేయాలన్నా అప్పులే

**- ఇదీ తెలంగాణ పరిస్థితి**

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం అమలు కోసం గణనీయమైన ఆర్థిక వనరులను సమీకరించేందుకు బహిరంగ మార్కెట్ నుంచి రుణాలను సేకరిస్తోంది. ఈ క్రమంలో జూన్ 2025లో రాష్ట్ర ఆర్థిక శాఖ మూడు విడతల్లో మొత్తం రూ.8,500 కోట్ల రుణాలను సమీకరించేందుకు ప్రభుత్వ బాండ్లను వేలం వేసింది. జూన్ 3న రూ.1,500 కోట్లు, జూన్ 10న రూ. 3,000 కోట్లు, జూన్ 17న మరో రూ.4,000 కోట్లను సేకరించేందుకు ఈ బాండ్ల వేలం జరిగింది. ఈ చర్యలు రైతులకు వానాకాలం సాగు కోసం పెట్టుబడి సాయం అందించేందుకు ఉద్దేశించినవి. రైతు భరోసా పథకం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల్లో ఒకటి.**

**హైదరాబాద్** ఇది రైతులకు సాగు కోసం ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి ఆర్థిక భద్రతను నిర్ధారించడానికి రూపొందించబడింది. ఈ పథకం కింద, అర్హత కలిగిన రైతులకు ఎకరానికి ఏటా రూ.12 వేలు అందించబడుతుంది. దీనిని రెండు విడతలుగా (ఎకరానికి రూ.6,000 చొప్పున) చెల్లిస్తారు. 2025 జూన్ 16 నాటికి, 41.25 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,349.83 కోట్లు జమ చేయబడ్డాయి. తొమ్మిది రోజుల్లో 70.11 లక్షల మంది రైతులకు రూ.9 వేల కోట్లు అందించే లక్ష్యంతో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ పథకం ద్వారా, 1.49 కోట్ల ఎకరాలకు ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. రైతు భరోసా పథకం కోసం రూ.8,500 కోట్ల రుణం సమీకరణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతోంది. గత ప్రభుత్వం నుంచి రూ.8 లక్షల కోట్ల అప్పుల భారాన్ని వారసత్వంగా పొందినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ అప్పుల భారం మధ్య, కొత్త రుణాల ద్వారా నిధుల సమీకరణ రాష్ట్ర ఆర్థిక శాఖకు సవాలుగా మారింది. జూన్ 2025లో జారీ చేసిన బాండ్లు రాష్ట్ర ఖజానాకు గణనీయమైన నిధులను అందించినప్పటికీ, ఈ రుణాల వడ్డీ చెల్లింపులు భవిష్యత్తులో ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచే అవకాశం ఉంది. రాష్ట్ర ఆర్థిక శాఖ ఈ బాండ్లను బహిరంగ మార్కెట్లో విక్రయించడం ద్వారా నిధులను సమీకరిస్తోంది, అయితే ఈ రుణాల దీర్ఘకాలిక ప్రభావం రాష్ట్ర ఆర్థిక స్థిరత్వంపై ఆధారపడి ఉంటుంది. రైతు భరోసా నిధుల కోసం రూ.15 వేల కోట్లకు పైగా అవసరమని అంచనా. ఈ రుణాలు తాత్కాలిక ఊరటనిచ్చినప్పటికీ, దీర్ఘకాలిక ఆర్థిక వ్యూహం

2లో..

## బనకచర్లపై భగ్గుమంటున్న తెలంగాణ

- నేడు అఖిలపక్షం భేటీ..
- ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్



**హైదరాబాద్** ఈ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో చంద్రబాబు ప్రపోజ్ చేసిన అతిపెద్ద ప్రాజెక్టు బనకచర్ల. గోదావరి నీటిని సీమకు తరలించే ఈ ప్రాజెక్టుపై ఏపీ చాలా శ్రద్ధ పెడుతోంది.

2లో..

## టీపీసీసీ చీఫ్‌కు కేటీఆర్ లీగల్ నోటీసులు

- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆరోపణలే ప్రధాన కారణం



**హైదరాబాద్** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నిత్యం చర్చనీయాంశంగా మారుతోంది. ఈ అంశంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ (భారత్ రాష్ట్ర సమితి) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడుతూ కేటీఆర్ మహేశ్ కుమార్‌గౌడ్‌కు లీగల్ నోటీసులు పంపించారు. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఉద్రిక్తతను పెంచింది. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేసింది. తనపై ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేసిన మహేశ్ కుమార్‌గౌడ్‌కు కేటీఆర్ గట్టి హెచ్చరిక పంపారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో చేతకాని కాంగ్రెస్ సర్కార్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని

2లో..

# తెలంగాణలో సమగ్ర గోసంరక్షణకు శ్రీకారం

- రాష్ట్రంలో సమగ్ర గోసంరక్షణ విధానం రూపకల్పన - వివిధ రాష్ట్రాల పద్ధతుల అధ్యయనానికి త్రిసభ్య కమిటీ
- నాలుగు ప్రాంతాల్లో అధునాతన గోశాలల నిర్మాణం - కోడెల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచన
- గోసంరక్షణకు నిధుల కొరత ఉండదని సీఎం భరోసా

**హైదరాబాద్** రాష్ట్రంలో గోవులను సంరక్షించేందుకు సమగ్రమైన విధానాన్ని రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందు కోసం ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న పద్ధతులను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ముగ్గురు కీలక అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న విశిష్ట స్థానాన్ని, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ, గోసంరక్షణే ప్రధాన లక్ష్యంగా ఈ పాలసీ ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గోసంరక్షణ అంశంపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరైన వసతి, స్థలం లేకపోవడం వంటి కారణాలతో గోవులు తరచూ

2లో..



## బీసీ రిజర్వేషన్లు ఇస్తేనే స్థానిక ఎన్నికలు

- జూలై 17న రైల్ రోకోకు కవిత పిలుపు



**హైదరాబాద్** తెలంగాణ జాగృతిని బలోపేతం చేస్తున్న కవిత ముందుగా బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమం ప్రారంభించాలని నిర్ణయించారు. జూలై 17న రాష్ట్ర వ్యాప్తంగా రైల్ రోకో కార్యక్రమానికి పిలుపునిచ్చారు. మెదక్‌లో బీసీ సంఘాలతో సమావేశమైన కవిత కీలక ప్రకటన చేశారు. బీసీ రిజర్వేషన్లపై బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తీవ్ర తరం చేయాలని నిర్ణయించారు. అన్ని బీసీ సంఘాల నాయకులను కలుపుకొని రైల్ రోకో చేస్తామని ఢిల్లీ పాలకులకు తెలంగాణ బీసీల పౌరుషాన్ని చాటుతామని కవిత ప్రకటించారు. ఢిల్లీ పాలనలకు సెగ తాకేలా రైల్ రోకో ఉంటుందని 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలు

2లో..

## హైదరాబాద్ వరద ముంపుపై హైడ్రా సరికొత్త వ్యూహం

- క్షణాల్లో రంగంలోకి స్పెషల్ టీమ్

HYDRAA

**హైదరాబాద్** దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతూ, విస్తరిస్తున్న నగరాల్లో హైదార్భాబాద్ అగ్రస్థానంలో నిలుస్తోంది. ఇంతటి మహానగరానికి మాత్రం వర్షం పడితే వణుకు తప్పడంలేదు. చినుకు పడితే చాలు రోడ్లు చిత్తడైపోతున్నాయి. డ్రైనేజ్ లు ఉప్పొంగుతూ ప్రధాన రహదారులను సైతం చెరువులుగా మార్చేస్తున్నాయి. ఓ గంట వాన పడితే నగరం అతలాకుతలమవుతోంది. వర్షాకాలంలో రోజూ వర్షాలు పడుతుంటే , భాగ్యనగరం దుస్థితి చెప్పనక్కర్లేదు. అనేక కాలనీలలో ఇళ్లలోకి వరద నీరు చేరడం, భారీ వృక్షాలు విరిగి రోడ్లపై

2లో..

### ఖానాపురంలో ఎమ్మెల్యే

## పద్మావతి జన్మదిన వేడుకలు




**కోదాడ :** కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలను ఖానాపురం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు గ్రామ మాజీ ఎంపీటీసీ గింజపల్లి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద గ్రామస్తుల సమక్షంలో కేక్ కట్ చేసి, రామాలయం గుడి, పాఠశాల ఆవరణల్లో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు.

## మోడీ అభివృద్ధికి ఆకర్షితులై బీజేపీలో చేరికలు

సూర్యాపేట, సూర్యాపేటలో పలు పార్టీలకు చెందిన నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ లో చేరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రధాని మోడీ చేస్తున్న అభివృద్ధి పథకాల పట్ల ఆకర్షితులై బిజెపిలో చేరుతున్నారన్నారు. బ్లూ ఇండియా పార్టీ నాయకులు సుంకర లింగారెడ్డి, ఇస్లావత్ రవి నాయక్, కాశయ్యలకు బిజెపి కదువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మన్మథ రెడ్డి, ఫణి నాయుడు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అబద్ధపు హామీలతో గద్దెనెక్కింది:

నిజామాబాద్, కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా షాకింగ్ కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో గద్దెనెక్కిందంటూ విమర్శించారు. కాంగ్రెస్ హయంలో జరిగిన అభివృద్ధి కంటే రెండింతల అభివృద్ధి మోదీ 11 ఏళ్ల పాలనలో జరిగిందంటూ పేర్కొన్నారు. పసుపు బోర్డు కోసం 40 ఏళ్లుగా ఎదురు చూసిన ప్రజల కల బీజేపీతో సాధ్యమైందని వెల్లడించారు. తెలంగాణలో కుల గణన తప్పుల తడకని, బీసీల జనాభా ఎలా తగ్గిందంటూ ప్రశ్నించారు.

## చర్లపల్లి రైల్వే స్టేషనుకు బస్ సౌకర్యం కల్పించాలి




**మేడ్చల్ :** చర్లపల్లి రైల్వే స్టేషన్ ఆధునీకరణ అనంతరం కొర్రెముల, చౌదరిగూడ ప్రజలు ప్రయాణానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైళ్ల సమయాలకు అనుగుణంగా బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బంగారి రాజయ్య, ఆళవందార్ వేణు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం



**ఏలూరు** మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం ఎంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి ప్రత్యేకంగా శక్తి టీంను ఏర్పాటు చేసిందని ,శక్తి టీం ఇన్చార్జి సీఐ సుబ్బారావు అన్నారు .ఏలూరు లోని సత్రంపాడు ప్రాంతంలో ఉన్న సాయి శ్రీ పారామెడికల్ కళాశాలలో మంగళవారం మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సిఐ సుబ్బారావు శక్తి యాప్ గురించిన విషయాలపై పారా మెడికల్ విద్యార్థినులకు అవగాహన కల్పించారు

## మాజీ ఎంపిటీసీ ఆత్మహత్యాయత్నం

**రాజన్న సిరిసిల్ల** తంగళ్ళపల్లి మండలం అంకుశాపూర్ మాజీ ఎం.పి.టి.సి.కుంటయ్య ఆత్మహత్యాయత్నం చేసాడు. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తన భూమిని కబ్జాచేసి వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించాడు. వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసి వాట్సాప్ స్టేటస్ లో పెట్టి కుంటయ్యపురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో లొకేషన్ ట్రేస్ చేసి అపస్మారక స్థితిలో ఉన్న కుంటయ్యను పోలీసులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమం గా వుండడంతో ప్రైవేట్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వేధింపులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని కుటుంబానికి న్యాయం చేయాలని కేటీఆర్ ను కోరుతు సూసైడ్ నోట్ నాసాడు. కుంటయ్యకు భార్య విజయ ఇద్దరు కూతుర్లు భార్గవి, దీక్షిత ఉన్నారు.

### అంగరంగ వైభముగా

## స్వామి వారి నిత్య కల్యాణం

**సింహాచలం :** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

## పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తా: నాగ సుబ్బారెడ్డి

### నాకు పదవి ఇచ్చిన పార్టీ నాయకులకు ధన్యవాదములు

- కష్టపడ్డ వారికి పార్టీ గుర్తిస్తుంది :
- ఎమ్మెల్సీ డిసి గోవింద్ రెడ్డి



**పోరుమామిళ్ల** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో నిబద్ధతతో నిజాయితీతో పని చేస్తానని కాశీనాయన మండలం, సావిశెట్టిపల్లె గ్రామానికి చెందిన యువకుడు ఎలిచెర్లనాగ సుబ్బారెడ్డికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా రైతు విభాగ ప్రధాన కార్యదర్శి పదవి చేపడుతున్న ఈ సందర్భం లో తెలిపారు .సోమవారం రాత్రి పోరుమామిళ్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గారి కి,రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి గార్లు కుపూలమాల మరియు శాలువాలతో నాగ సుబ్బారెడ్డి తో పాటు ఇతర నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు స్పందిస్తూ, నాగ సుబ్బారెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడు కావడంతో అతనికి ఈ పదవి రావడం హర్షనీయం అని అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వ హయాంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని పార్టీ అధిష్టానానికి తీసుకెళ్లి తగిన పరిష్కారాలు తీసుకురావాలని సూచించారు.ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గారు మాట్లాడుతూ, జగనన్న ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. పార్టీకి విధేయంగా పనిచేసే వారికి పదవులు తప్పకుండా వస్తాయన్నారు. పదవి బాధ్యత స్వీకరించిన నాగ సుబ్బారెడ్డి మాట్లాడుతూ, "నాపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారికి కడప జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి గారికి పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి గారికి శాసనసభ్యురాలు వెంకట సుధా గారికి ఎమ్మెల్సీ డిసి గోవింద్ రెడ్డి గారికి ఇతర నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. నాకు అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా, విబద్ధతతో అంకితభావంతో కృషి చేస్తానని నాగ సుబ్బారెడ్డి తెలిపారుఈ కార్యక్రమంలో మాజీ పంచాయతీరాజ్ ప్రభుత్వ సలహాదారులు నాగార్జున రెడ్డి , నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త రమణారెడ్డి, కాశి నాయన మండలం జెడ్పిటిసి దేవసాని సత్యనారాయణ రెడ్డి, కాశి నాయన మండల కన్వీనర్ హనుమంతు రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు క్లాస్ వన్ కాంట్రాక్టర్ పంగా గురివి రెడ్డి, పోరుమామిళ్ల మండలం జెడ్పిటిసి ముత్యాల ప్రసాద్,పోరుమామిళ్ల మండల కన్వీనర్ సీఎం భాష, కాశి నాయనమండలం పార్టీ ఎం కృష్ణారెడ్డి , నరసింహారెడ్డి, గురువు రెడ్డి, గంటా రమణారెడ్డి, జగన్మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చాపాటి నారాయణరెడ్డి, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రెటరీ రాళ్లపల్లి నరసింహులు, జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులు రాజీవ్ భాష, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు పొదిలి మస్తాన్ మసీ, వార్డు మెంబర్ తులసి సురేష్, బాబు, పెసల గణేష్, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణ రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలయ్యి ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య



**మంచిర్యాల** ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలయ్యి ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ లోని జయశంకర్ కాలనీకి చెందిన అక్షయ్ అనే విద్యార్థి ఇంటర్ సెకండ్ ఇయర్ గణితం సప్లిమెంటరీ పరీక్షలో ఫెయిల్ అయ్యాడు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం దాస్ తండాకు చెందిన గుగులోత్ హారిక (17) ఇంటర్ మొదటి సంవత్సరంలో బాటనీ పరీక్ష ఫెయిల్ అయ్యి సప్లిమెంటరీ రాయగా అందులోనూ ఫెయిల్ అయింది. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం మహబత్ పూర్ గ్రామానికి చెందిన వెంకటరమణ (18) కుడా ఇంటర్ సెకండ్ ఇయర్ సప్లిమెంటరీ పరీక్షలు రాసి అందులో ఒక్క సబ్జెక్టు ఫెయిల్ అయ్యాడు. ముగ్గురూ మనస్తాపంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు.

### వినాయకసాగర్‌లో పెండింగ్ పనులు

## త్వరగా పూర్తి చేయండి

వినాయక సాగర్ అభివృద్ధి పనుల్లో పెండింగ్ లో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం వినాయక సాగర్ ను, కొర్లగుంట వద్ద జరుగుతున్న డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వినాయక సాగర్ లో స్విమ్మింగ్ పూల్, గ్లో గార్డెన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సాగర్ వాకింగ్ ట్రాక్ నందు పెరిగిన మొక్కలు కత్తిరించి వాకర్స్ కు ఇబ్బంది లేకుండా చేయాలని అన్నారు. అక్కడ ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో మొక్కలు నాటాలని అన్నారు. సాగర్ ను పరిశుభ్రంగా ఉంచి, ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా ఏర్పాటు చేయాలని అన్నారు. కొర్లగుంట ఆరోగ్య ఫార్మసీ వద్ద జరుగుతున్న డ్రైనేజీ కాలువ నిర్మాణాన్ని పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ ఈ.ఈ.రవి, డి.ఈ. రమణ, రాజు, వెంకట ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## కుప్పం ఘటనపై సీఎం మండిపాటు

- నిందితులపై కఠిన చర్యకు ఆదేశం

**అమరావతి** కుప్పంలో మహిళపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలకు సిఎం చంద్రబాబు ఆదేశం జారీ చేసారు. అప్పు తీర్చలేదని కుప్పం మండలం నారాయణపురం గ్రామంలో మహిళపై దాడి చేసి ఆమెను చెట్టుకు కట్టేసి అమానుషంగా వ్యవహరించిన మునికన్నప్ప, అతని కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ విషయంపై ముఖ్యమంత్రి జిల్లా ఎస్పీతో మాట్లాడారు. నిందితుడిని ఇప్పటికే అరెస్టు చేశామని జిల్లా ఎస్పీ తెలిపారు. మహిళను చెట్టుకు కట్టేసి హింసించిన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశం ఇచ్చారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా పోలీసులు చూడాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి అండగా ఉండాలని జిల్లా అధికారులకు సిఎం స్పష్టమైన ఆదేశం ఇచ్చారు

## అనుమానాస్పద స్థితి లో గుర్తు తెలియని శవం



**రాయచోటి** రాయచోటి పట్టణ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి లో అనుమానాస్పద స్థితి లో గుర్తు తెలియని శవం ఉన్నట్లు మంగళవారం ఉదయం పోలీసులు గుర్తించారు. తల, ముఖం, చేతి పై రక్త గాయాలు ఉన్నాయన్నారు. ఇక్కడ చంపారా లేదా బయట చంపే ఇక్కడికి తీసుకొచ్చి పడేసారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పంచనామా నిమిత్తం బాడీని మార్చురీకి వైద్య సిబ్బంది తరలించారు. మిగతా వివరాలు తెలియాల్సి ఉంది..

## కొత్తగా ఆటో రిక్షా పర్మిట్లు జారీ, రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రతిపాదన పై హర్షం

**హైదరాబాద్** నగరంలో కొత్త ఆటో రిక్షా పర్మిట్లు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం జిఓ జారీ చేసినందుకు మరియు రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వ ప్రతిపాదన ప్రకటించడం పట్ల తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జేఏసీ హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జేఏసీ నేతలు ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్ లో సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం (ఏఐటియుసి), వి.మారయ్య, మహేష్ (బిఆర్టియు,) పి.శ్రీకాంత్, అజయ్బాబు (సిఐటియు), వి.ప్రవీణ్ (టియుసిఐ), ఎం.ఎ.సలీం, నజీర్, రఫీక్ (యుటిఎడిడబ్ల్యుఎ,) పి.రాంరెడ్డి (ఐఎఫ్టియు), పి. యాదగిరి (టీఎస్టీయూసీ) ఎస్.కె.పి. జమ (జిహెచ్ఎడియు) లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి. వెంకటేష్ మాట్లాడుతూ కొత్తగా ఆటో రిక్షా పర్మిట్లు జారీకి, రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు గత రెండు దశాబ్దాలుగా అనేక రూపాల్లో పోరాటాలు నిర్వహించామని, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, ఎమ్మెల్సీ ప్రో. ఏం. కోదండరాం లు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, పలుమార్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేర్చలు జరిపి జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలో కొత్తగా 60 వేల ఆటో రిక్షా పర్మిట్లు ఇవ్వడానికి ప్రభుత్వ జిఓ జారీ కృషి చేసారని అలాగే రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటు ప్రతిపాదన ప్రకటింపజేశారని తెలిపారు. 2023 సంవత్సరం నుండి ఆటో మీటర్ చార్జీలు నాటి ప్రభుత్వాలు పెంచకుండా నిర్లక్ష్యం వహించడంతో ఆటో డ్రైవర్లు అనేక ఆర్థిక సమస్యలను ఎదుర్కుంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆటో మీటర్ చార్జీలు మినిమం ఛార్జి రూ.50/-, కిలోమీటర్ కు రూ. 20/- పెంచాలని, ఎన్నికల మానిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు హామీ ఇచ్చిన రూ.12.000/- ఆర్థిక సహాయం వెంటనే అందజేయాలని అలాగే ఆటో డ్రైవర్ల పొట్టకొడుతున్న ఓలా, ఊబర్, రాపిడోల బైక్ టాక్సీ లను నిషేదించాలని బి.వెంకటేశం విజ్ఞప్తి చేసారు. .

## కార్మికులపై నిర్బంధం ఆపాలి

**విశాఖపట్నం** విశాఖ స్టీల్ ప్లాంట్లో అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధం ఆపాలని సిఐటి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె. ఎస్.వి.కుమార్, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మదరావులు డిమాండ్ చేసారు. కాంట్రాక్టు కార్మికులకు మద్దతుగా జగదాంబ జంక్షన్లో అఖిలపక్ష కార్మిక సంఘా లు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసనలో నాయకులు పాల్గొని మాట్లాడుతూ స్టీల్ప్లాంట్ను కాపాడుతామన్న రాష్ట్ర కూటమి ప్రభుత్వ పెద్దలు కార్మికుల ఉపాధినే కాపాడలేకపోయారని విమర్శించా రు. 7.3 మిలియన్ టన్నుల సామ ర్థ్యంతో నడుస్తున్న స్టీల్ప్లాంట్లో అదనంగా ఆరువేల మంది కార్మి కుల అవసరం ఉన్నప్పటికీ పనిలో ఉన్న 4500 మంది కార్మికులను అక్రమంగా తొలగించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. కార్మికులు తమ ఉపాధిరక్షణకోసం పోరాడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్షపూరి తంగా వ్యవహరించి పోలీసులతో నూ, బెదిరింపులతో ఉద్యమాన్ని అణిచివేయడాన్ని కార్మికవర్గం ముక్తకంఠంతో ఖండిరచిందన్నారు.

# సుపరిపాలన

## సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

- మాది పనిచేసే ప్రభుత్వం..
- సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరువచేస్తున్నాం..
- తల్లికి వందనం పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేశాం.

.- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

**చిత్తూరు** సుపరిపాలన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఓ ప్రకటనలో కొనియాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలకు కట్టుబడి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నామని ఆయన తెలిపారు. గత వైకాపా ప్రభుత్వ అసమర్థత వల్ల రాష్ట్రం ఆర్థిక పరిస్థితి దివాలా తీసినా.., సి.యం.చంద్రబాబు అపార అనుభవం.., పాలనా దక్షతతో తల్లికి వందనం పథకం అమలయ్యిందనీ కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుందని.., ఫలితంగా సర్వత్రా విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు.అందుకనే మాది పనిచేసే ప్రభుత్వమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ఉద్ఘాటించారు. తల్లికి వందనం పథకం విజయవంతంగా అమలవుతున్న నేపథ్యంలో ఢిల్లీలో ఉన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు.. మంగళవారం ఓ ప్రకటనలో స్పందించారు.

వేసవి సెలవులు ముగిసిన తక్షణం.., రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ..,రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు చెప్పినట్టుగానే విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఓకుటుంబంలో ఎంత మంది పిల్లలు విద్యనభ్యసిస్తున్నారో.. వారందరికీ తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేసి.,జూన్ 12వ తేదీనే.. విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసి, పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. ప్రజలకు జవాబు దారిగా పనిచేస్తున్న మా ప్రభుత్వం పనితీరును , చూసి ఓర్వలేని వైకాపా నాయకులు పనికట్టుకొని పనిచేసే ప్రభుత్వం పై బురదజల్లడం సరికాదని హితవు పలికారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రం ప్రగతి వైపు పయనిస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి ,ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వారు పని చేయడం శుభపరిణామమన్నారు. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో తాము కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను రాబట్టి నవ్యాంధ్ర నిర్మాణానికి నిరంతరం

## ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలను తొలగించిన సుగుణక్క



**ఆదిలాబాద్:** ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అదిలాబాద్ పార్లమెంట్ ఇంచార్జి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఆత్రం సుగుణక్క పేర్కొన్నారు. ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల ప్రాంతాలో మంగళవారం పిచ్చి మొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. నివాస పరిసరాలను, ప్రభుత్వ కార్యాలయాలను కూడా వర్షాకాలంలో పిచ్చి మొక్కలు పెరగకుండా, మురికి నీరు చేరకుండా చూసుకోవాలని సూచించారు. నీటి నిల్వతో ఈగలు, దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులు వస్తున్నాయన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన ఆదిలాబాద్ కలెక్టర్

**బోథ్:** ఇంద్రవెల్లి మండలం పిట్టబొంగరంలో ఇంద్రవెల్లి అమరవీరులకు, ఇతర లబ్ధిదారులకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సబ్ కలెక్టర్ యువరాజ్ తో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఇంటి నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణ పనులలో నాణ్యత పాటించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంద్రమ్మ ఇల్లు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు.

## భైంసాలో బురిడీ కొట్టించి గోల్డ్ చైన్ చోరీ

**ఖానాపూర్ :** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని పిప్రి కాలనీలో కుంటాల (M) అంబకంటికి గ్రామానికి చెందిన రాజవ్వ, గోవింద్ దంపతులను ముగ్గురు అగంతకులు బురిడీ కొట్టించి 2 తులాల గోల్డ్ చైన్ చోరీ చేశారు. శుభకార్యానికి వచ్చిన వృద్ధులతో తాము అధికారులమని, గోల్డ్ ఉంటే లోపల పెట్టుకోవాలని సూచించారు. వారి బంగారాన్ని తీయించి ఓ పేపర్లో పెట్టారు. ప్లాన్ ప్రకారం వారు తెచ్చుకున్న మట్టి చుట్టిన పొట్లం ఇచ్చి వెళ్లిపోయారు. కొద్దిసేపటికి వృద్ధులు తాము మోసపోయామని గ్రహించారు.

## స్మారక క్లాక్ టవర్ పనులను పూర్తి చేయాలని వినతి

నిర్మల్, జూన్ 17(ఎ.ఎం.ఎస్): మౌలానా అబుల్ కలాం ఆజాద్ చౌరస్తాలో నిర్మాణంలో ఉన్న స్మారక క్లాక్ టవర్ పనులను పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్, నిర్మల్ డిసిసి అధ్యక్షులు కే. శ్రీహరి రావులకు కలాంగుణం సొసైటీ బాధ్యులు మంగళవారం వినతి సమర్పించారు. 22 ఏళ్లుగా మౌలానా ఆజాద్ స్మారక నిర్మాణ కోసం తమ కలాం గుణం సొసైటీ ఆధ్వర్యంలో పోరాడుతున్నామన్నారు. మూడేళ్ల క్రితం ప్రారంభించిన పనులు రెండేళ్లుగా ఆగిపోయాయని పేర్కొన్నారు.

## అక్రమ షెడ్లను తొలగించాలి

**ముథోల్ :** కుబీర్ ప్రభుత్వ ఆసుపత్రికి ఆనుకోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ షెడ్లను తొలగించాలని వ్యాపారస్థులకు భైంసా ఆర్డిఒ కోమల్ రెడ్డి సూచించారు. కోర్టు ఆదేశాల మేరకు ఆయన మండలాన్ని మంగళవారం సందర్శించారు. రేపటి లోగా అక్రమంగా నిర్మించుకున్న షెడ్లను తొలగించాలని, లేని యెడల నిర్మాణాలపై సంబంధిత చర్యలు చేపడతామన్నారు. ఆర్డిఒతో పాటు ఎమ్మార్వో శివరాజ్, ఎంపీడీవో సాగర్ రెడ్డి, ఎంపీవో మోహన్ సింగ్, గ్రామపంచాయతీ అధికారులు ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యేల విగ్రహాలు ఏర్పాటు చేయాలి



**కోరుట్ల :** జగిత్యాల జిల్లా మల్లపూర్ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యేలు కొమిరెడ్డి రాములు జ్యోతక్క విగ్రహాలు ఏర్పాటు చేయాలని మల్లాపూర్ తహసిల్దార్ కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కటుకం గంగిరెడ్డి, ఉపాధ్యక్షులు తెలు నరేష్, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు బైరవేని శశిగౌడ్, జావిడి రాజారెడ్డి, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కొత్తూరు మారుతి లోకేష్ పాల్గొన్నారు

## తిరుమలకు వెళ్లిన తెలంగాణ మంత్రి లక్ష్మణ్ కుమార్

**ధర్మపురి :** తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనంకు మంగళవారం మెట్ల మార్గంలో కాలినడకన ఏడుకొండలు ఎక్కుతూ వెళ్ళారు. తమ ఇలవేల్పు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం తిరుపతి చేరుకున్న మంత్రి శ్రీవారి దర్శనం కోసం అలిపిరి నుండి కాలినడకన బయలుదేరారు.

# కాంగ్రెస్‌వి అవగాహన లేకుండా కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు




**విజయవాడ** బిజెపి రాష్ట్ర కార్యాలయం లో పాత్రికేయుల సమావేశం జరిగింది. బీజేపీ ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలన ఒక సువర్ణ అధ్యాయం గా అభివర్ణించారు . జాతీయ స్థాయిలో కాంగ్రెస్, రాష్ట్రంలో వైసీపీ ఉనికిని కోల్పోతున్నాయి . వికసిత్ భారత్ కి అమృత కాలం. పేదల సంక్షేమం భారత దేశం గౌరవం నిలబెడుతూ ప్రధాని పాలన కొనసాగుతుంది. రైతుల సంక్షేమం కొరకు ప్రధాన ధ్యేయం గా పాలన ఉంటుంది. ఆర్థిక రంగంలో 4వ స్థానానికి ప్రధాని మోదీ తీసుకొచ్చారన అన్నారు. సేవా,సంక్షేమ కార్యక్రమాలతో ఆత్మ నిర్భర్ భారత్ గా మోదీ పరిపాలిస్తున్నారు .జల జీవన్, ఆయుష్మాన్ భారత్, ఇలా అనేక కేంద్ర పథకాలతో పేదలకి మంచి చేస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడటంలో గత ప్రభుత్వలకి భిన్నంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారు. ఆపరేషన్ సింధూర్ తో రక్షణ రంగంలో ఎంత ప్రగతి సాధించామో ప్రపంచ దేశాలకి చాటి చెప్పామని అన్నారు. మేక్ ఇన్ ఇండియా మేడ్ ఇన్ ఇండియా లో భాగంగా రక్షణ రంగంలో కావలసిన పరికరాలని మనం సమకుర్చుకున్నాం. చినాబ్ నది పై సాంకేతిక పరిజ్ఞానం తో వంతెన నిర్మాణం చేపట్టడం జరిగింది. మోదీ పాలన లో ఆర్థిక వ్యవస్థ రాబోయే రోజుల్లో 3వ స్థానానికి రానుంది. నారీ వ్యవస్థలో మైనారిటీ మహిళలకి, మహిళలకి సమూచిత స్థానాన్ని కలిపించారు. ఆపరేషన్ సింధూర్ లో ఇద్దరు మహిళలు నాయకత్వం వహించి సుదీర్ఘ కాలం తరువాత జనగణన కి గజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. కులగణన చేపట్టడం జరిగింది. వీటిపై అవగాహన లేకుండా కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు చేస్తుంది. ప్రపంచం దేశాలకి భారత దేశాన్ని విశ్వ గురు దేశంగా చూపించేలా మోదీ చేసారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం నాయకత్వం లేదు. దేశ అభివృద్ధి పై కాంగ్రెస్ అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారు. యోగా దినోత్సవాన్ని ప్రపంచ దేశాలు భారత దేశం వైపు చూసేలా మోదీ చేసారు . ప్రపంచ రికార్డ్స్ లో అరుదైన రికార్డు సొంతం చేసుకునేలా మోదీ ప్రణాళికలు చేసారు. ఒక్క ఆంధ్రప్రదేశ్ లోనే ఎక్కువ సంఖ్యలో యోగా చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారు .రాష్ట్ర ప్రజలందరూ యోగా లో భాగస్వామ్యం అవ్వాలని బీజేపీ పిలుపినిస్తుందని అన్నారు. ఈ పాత్రికేయుల సమావేశంలో బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార్ స్వామి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీ రాం తదితరులు పాల్గొన్నారు

## మొక్కలు నాటిన మధిర బీజేపీ నాయకులు

**మధిర:** బీజేపీ ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పరిపాలన సందర్భంగా జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆదేశాల మేరకు మధిర మండల బీజేపీ అధ్యక్షులు గడ్డం శ్రీహరి చౌదరి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని ఆత్కూరు గ్రామంలో 195వ బూత్ లో మరియు దెందుకూరు గ్రామంలో 207, 208 బూత్ లలో మొక్కలు నాటడం జరిగింది. మోడీ పరిపాలనలో దేశం అభివృద్ధి చెందుతున్న విధానాన్ని ప్రజలకు వివరిస్తూ అభివృద్ధికి నిదర్శనంగా గ్రామాలలో మొక్కలు నాటడం జరిగింది.

## పివైఎల్ ఖమ్మం డివిజన్ నూతన కమిటీ ఎన్నిక

**ఖమ్మం :** రఘునాధపాలెం మండలం పెద్ద ఈర్లపూడి గ్రామంలో జరిగిన పివైఎల్ ఖమ్మం డివిజన్ జనరల్ కౌన్సిల్స్ లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పివైఎల్ ఖమ్మం డివిజన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఇస్లావత్ రమేష్, సిహెచ్ ధరణ్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాటోత్ ప్రేమ్ సింగ్, ఎన్. వి రాకేష్ అభినందనలు తెలిపారు. యువత, ప్రజా సమస్యలపై మరింత కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

## సింగరేణి డైరెక్టర్ ను కలిసిన ఎఐటీయూసీ నాయకులు

**కొత్తగూడెం :** సింగరేణి డైరెక్టర్ (పా) గా బాధ్యతలు చేపట్టిన గౌతమ్ పోట్రు ఎఐటీయూసీ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘం- ఎఐటీయూసీ అధ్యక్షులు కామ్రేడ్ వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కొరిమి రాజ్ కుమార్, అన్ని ఏరియాల యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సింగరేణి డైరెక్టర్(పా)గా బాధ్యతల స్వీకరణ

**భద్రాచలం :** సింగరేణి డైరెక్టర్ (పా)గా నియమితులైన గౌతమ్ పొట్రు కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్. వి. సూర్యనారాయణ, డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం అన్ని శాఖల జనరల్ మేనేజర్లు, అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు గౌతమ్ పొట్రును మర్యాదపూర్వకంగా కలిశారు.

## వరంగల్ డివిజన్ పోలీసులకు సిపి మెమో జారీ

**వరంగల్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పనిచేస్తున్న పోలీసు అధికారులకు వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్ మెమోలు జారీ చేశారు. రాష్ట్ర మంత్రి, తూర్పు నియోజకవర్గ శాసన సభ్యురాలు కొండా సురేఖ భర్త కొండ మురళికి ఎస్కార్ట్ గా పోలీస్ వాహనాలను ఏర్పాటు చేసినందుకు సదరు పోలీస్ అధికారులపై చర్యలు తీసుకున్నారు. ఏసిపితో పాటు నలుగురు ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలకు మెమొలు జారీ చేశారు. ప్రోటోకాల్ లేని అధికార పార్టీ నాయకుడికి నిబంధనలను ఉల్లంఘించినందుకుగాను సీపీ ఫైర్ అయినట్లు సమాచారం.

## నియోజకవర్గంలో మంత్రి పొన్నం పర్యటన



**నర్సంపేట :** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలో ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ నర్సంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో మంగళవారం సమావేశం అయ్యారు. నర్సంపేట నియోజకవర్గం అభివృద్ధి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లబ్ధిదారుల ఎంపిక రైతు భరోసా వంటి పథకాల అమలుపై చర్చించారు మంత్రిని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు కలిశారు. జిల్లా కలెక్టర్ తో పాటు పలువురు అధికారులు మంత్రి ని కలిశారు.

## దుబ్బాక మున్సిపల్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

**దుబ్బాక:** మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ఆదేశాల మేరకు మున్సిపల్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ సమక్షంలో బీజేపీ దుబ్బాక మున్సిపల్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. దుబ్బాక పట్టణంలో ఎంపీ నివాసంలో మంగళవారం మున్సిపల్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ సమక్షంలో బీజేపీ దుబ్బాక మున్సిపల్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మూసివేసిన పాఠశాలను తెరిపించాలని వినతి



**నారాయణఖేడ్:** ఆరు సంవత్సరాలుగా మూతపడిన జూజల్ పూర్ ప్రాథమిక పాఠశాలను తెరిపించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ ఎంఈఓ కు మండల అధ్యక్షుడు ఏసుదాస్ మంగళవారం వినతి పత్రం సమర్పించారు. మండల అధ్యక్షుడు ఏసుదాస్ మాట్లాడుతూ పాఠశాల తెరిపిస్తే విద్యార్థులను చేర్పిస్తామని తల్లిదండ్రులు చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**సంగారెడ్డి :** స్కూల్ కాలేజీ వాహనాలు మద్యం తాగి నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పరితోష్ పంకజ్ మంగళవారం హెచ్చరించారు. డ్రైవర్లకు ముందుగానే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించి విధుల్లోకి అనుమతించాలని చెప్పారు. తనిఖీల్లో మద్యం తాగి పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు.

## స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి ఎంపికలు

నారాయణఖేడ్, జూన్ 17(ఎ.ఎం.ఎస్): తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్స్ లో 4వ తరగతిలో ప్రవేశానికి ఎంపిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రావిణ్య తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రవేశాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ హకీంపేట, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో బాలికలకు 20 సీట్లు చొప్పున ఉన్నాయని చెప్పారు. ఈనెల 25, 26వ తేదీలో జిల్లా స్థాయి ఎంపికలు సంగారెడ్డిలో జరుగుతాయని పేర్కొన్నారు.

## మా గ్రామంలోనే చదివిస్తాం.. ప్రైవేటుకు పంపం

నాగర్‌కర్నూల్, జూన్ 17(ఎ.ఎం.ఎస్): నాగర్ కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం గౌతంపల్లి గ్రామ తల్లిదండ్రులు తహశీల్దార్ జాకీర్ అలీ, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి సమక్షంలో తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంపమని ప్రతిజ్ఞ చేశారు. సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని తమ గ్రామంలోనే వారి పిల్లలను చదివిస్తామని, తమ గ్రామ పాఠశాల అభివృద్ధిని తామే చేసుకుంటామని ఉపాధ్యాయుల విద్యార్థుల సమక్షంలో మంగళవారం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ఆకస్మిక పర్యటన



దేవరకొండ, జూన్ 17(ఎ.ఎం.ఎస్): చందంపేట మండలంలో మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా పర్యటించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం చిత్రియాలలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల గురించి ఆరా తీశారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ రమణారెడ్డి, రాజ్ కుమార్, కృష్ణవేణి, చత్రు నాయక్, చందర్, శ్రీధర్ బాబు, లక్ష్మి తదితరులు ఉన్నారు.

%Edited, Printed, Published and Owned by PURAM MAHESHWAR Printed at HARI HARA ART PRINTERS,H.No.6-185,Toopran,Dist.Medak, Telangana-502336. and Published at H.No. 4-50/18,Kallakal, Vill-Kallakal,(PO). Kadlakal,(M) Manoharabad, Dist.Medak-Telangana -502336. Editor: PURAM MAHESHWAR. RNI. No:TELTEL/2006/17154. Cell:800860999